అకాల వర్షం.. రైతన్నకు నష్టం

- మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలపై అధిక ప్రభావం
- చల్లటి వాతావరణంతో మాడుతున్న జీడిమామిడి పూత
- గాలులకు రాలుతున్న పిందెలు
- బెంబేలెత్తుతున్న రైతన్నలు

బుట్టాయగూడెం : బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో గత రెండు రోజులుగా ఏజెన్సీ మెట్టప్రాంతాల్లో తీవ్రమైన గాలితో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. మరొక 4 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలతో రబీలో పంటలు వేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ వర్షాల వల్ల మొక్కజొన్న, పొగాకు, మిర్చితోపాటు జీడిమామిడి రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే మొక్కజొన్న పంట ప్రస్తుతం పాలుపోసుకునే దశలో ఉండడంతో అకాల వర్షాల వల్ల పంట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా మిర్చిపంట కూడా కోత దశకు వచ్చింది. అలాగే వర్జీనియా పొగాకు పంటలు కూడా కొంతమేర రెల్చులు అయినప్పటికీ ఆలస్యంగా పంటలు వేసిన రైతులకు ఈ వర్షాలు దెబ్బతీసే అవకాశం ఉందని పొగాకు రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే మరొక 4 రోజులపాటు వర్షాలు ఉండే అవకాశం ఉండడంతో పంటల పరిస్థితిపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

దిగులు చెందుతున్న జీడిమామిడి రైతులు

జీడిమామిడి రైతుల పంట పండాలంటే పూత నుంచి కాయలు వచ్చే వరకూ వెచ్చదనం కావాలి. అలా ఉంటేనే పంట దిగుబడి వచ్చి రైతులకు లాభాలు వస్తాయి. అయితే ప్రస్తుతం అకాల వర్షాలతో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల చల్లదనం పెరిగింది. దీనివల్ల పూత చాలా వరకూ మాడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. దీనితో రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. అలాగే పిందులు కూడా రాలిపోయే పరిస్థితికి వచ్చాయి. ఇక తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు అంటున్నారు.


బుట్టాయగూడెంలో కురుస్తున్న భారీ వర్షం

డివిజన్‌లో 44607.80 ఎకరాల్లో పంటల సాగు

కేఆర్‌పురం ఐటీడీఏ డివిజన్ పరిధిలో గల మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో సుమారు 44607.08 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు వేశారు. వీటిలో వరి 6306.33 ఎకరాలు, మొక్కజొన్న 18,699.94 ఎకరాలు, చెరకు 890.61 ఎకరాలు, వర్జీనియా పొగాకు 15,156.51 ఎకరాలు, నాటు పొగాకు 420.2 ఎకరాలు, వేరుశనగ 2,025.97 ఎకరాలు, మిర్చి 531.93 ఎకరాలు, మినుములు 552.17 ఎకరాలు, పెసలు 54.14 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఈ వర్షాలు మిగిలిన పంటలకు అనుకూలమైనప్పటికీ మొక్కజొన్న, వర్జీనియా పొగాకు, నాటు పొగాకు, మిర్చి పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో సుమారు 1500 ఎకరాల్లో జీడిమామిడి పంటల్లో రైతులు పండిస్తున్నారు.

దెబ్బతిన్న మొక్కజొన్న

లింగపాలెం : తుపాను ప్రభావంతో శనివారం లింగపాలెం మండలంలో భారీగా వర్షం పడింది. దీంతో మండలంలోని వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఎక్కువగా ఎండిమిర్చి, మొక్కజొన్న, నాటుపొగాకు పంటలు పొలాల్లో ఎక్కడపడితే అక్కడే ఆరపెట్టారు. దీంతో పంటలు తడవకుండా రైతులు బరకాలు వేశారు. పంటలు తడిచిపోతే నాణ్యత తగ్గి ధర పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజుపాటు పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో పొలాల్లో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పరుగులు పెడుతున్నారు. మండలంలో సుమారు 250 ఎకరాల్లో మొక్కజొన్న పైరు పూర్తిగా పడిపోయిందని, ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు వ్యవసాయాధికారులు బాబురావు, మురళీకృష్ణ తెలిపారు.


ధర్మాజీగూడెంలో గాలికి పడిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు


జంగారెడ్డిగూడెం మండలంలో నేలకొరిగిన పొగాకు తోట

వడగళ్ల వాన

జంగారెడ్డిగూడెం : మండలంలో శనివారం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. అకాల వర్షాలకు మొక్కజొన్న పంట నేలకొరిగింది. సుమారు 50 ఎకరాల్లో మొక్కజొన్న తోటలు నేలకొరిగినట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే పొగాకు తోటలు దెబ్బతిన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది.

మిర్చిని ముంచేసింది

వేలేరుపాడు : రెండురోజు కూడా కురిసిన అకాల వర్షం మిర్చి రైతులను ముంచేసింది. కల్లాల్లో ఆరబెట్టి ఉన్న మిర్చి శనివారం కూడా తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొందరు రైతులకు అందుబాటులో పరదాలు ఉండటంతో మిర్చిని తడవకుండా జాగ్రత్తపడ్డారు. అయినప్పటికీ వర్షం భారీగా కురవడంతో రేపాక గొమ్ము, తాట్కూరు గొమ్ము, రుద్రమకోట, తిరుమలాపురం, వేలేరుపాడు ప్రాంతాల్లో మిర్చి తడిసిపోయింది. ఆదివారం కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు కంటిపై కునుకులేకుండా పోయింది. చేతికందే పంట నీటి పాలవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


తాట్కూరు గొమ్ములో కల్లాల్లో తడిసిన మిర్చి

క్లుప్తంగా

పంట నష్టాన్ని అంచనా వేయాలి


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న బాలరాజు

బుట్టాయగూడెం : అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి వ్యవసాయాధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం ఫోన్‌లో అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న, పొగాకు, మిర్చి, జీడిమామిడి రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులకు అండగా ఉండే విధంగా వెంటనే పంటనష్టాలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం కళ్లాల్లో ఉన్న మిర్చి పంటలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పినట్లు తెలిపారు. అలాగే తీవ్రమైన గాలులు వీస్తున్నందున అనేకచోట్ల చెట్ల కొమ్మలు రోడ్లపై పడినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకునే విధంగా చూడాలని చెప్పినట్లు తెలిపారు.

భక్తుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌పై షెడ్డు నిర్మాణం


శ్రీవారి కొండపైన నిర్మిస్తున్న షెడ్

ద్వారకాతిరుమల : శ్రీవారి భక్తుల సౌకర్యార్థం కొండపైన కేశ ఖండన శాల నుంచి జంట గోపురాల ముందు వరకు ఫుట్‌పాత్‌పై పెడస్ట్రెయిన్ షెడ్‌ను నిర్మిస్తున్నారు. రూ.16.50 లక్షల వ్యయంతో 144 మీటర్ల మేర ఈ షెడ్డును నిర్మిస్తున్నారు. ప్రస్తుత వేసవిలో ఎండ నుంచి భక్తులకు ఈ షెడ్డు నిర్మాణం ద్వారా ఉపశమనం కలుగుతుందని, వర్షాకాలంలోను ఇది సౌకర్యవంతంగా ఉంటుందని ఆలయ అధికారులు చెబుతున్నారు. త్వరితగతిన ఈ షెడ్డు నిర్మాణ పనులను పూర్తిచేస్తామన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

లింగపాలెం : నరసన్నపాలెంలో శ్రీకోదండరామాలయ నిర్మాణానికి లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు దాత బీవీఎస్ రెడ్డిని సత్కరించారు. తన వంతుగా గ్రామాలలో ఆలయ నిర్మాణాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బీవీఎస్ రెడ్డి తెలిపారు.

కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని మోటార్ ఫీల్డ్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కార్యాలయం వద్ద ఉదయం 10.18 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, మోటార్ ఫీల్డ్ వర్కర్ల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

బుట్టాయగూడెం : మండలంలోని నూతిరామన్నపాలెంలో శనివారం పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పొడియం లక్ష్మణరావు దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు బానోతు కృష్ణనాయక్, శ్రీను, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

జంగారెడ్డిగూడెం : స్థానిక అశ్వారావుపేట రోడ్డులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో శనివారం తొలగించారు. డిప్యూటీ తహసిల్దార్ రమేష్, మున్సిపల్ టీపీవో వి.జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట రోడ్డులో సర్వే నెంబర్ 704 ప్రభుత్వ భూమిగా ఉందన్నారు. అయితే దీని వెనుక ఉన్న భూమి 450/4 సర్వే నెంబరుకు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి, 704 సర్వేలోని భూమిని ఆక్రమించి కట్టడాలు కట్టారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమణలను తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు బాజీ, దుర్గాభవానీ, సచివాలయ సిబ్బంది నాగు, కిషోర్, ఏఎస్సై ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

పోలవరం రూరల్ : ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవంలో భాగంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. వీటిలో భాగంగా డాక్టర్ భార్గవ్ నోటిక్యాన్సర్ , క్లీనింగ్, దంతధావనం చేయాల్సిన విధానం, నోటి సంరక్షణ గురించి స్థానిక వృద్ధాశ్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ పొగాకు నమలడం, మద్యం సేవించడం, గుట్కా, పాన్ తినడం వల్ల నోటిక్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ చక్రపాణి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ తమిళ్లక, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపిణీ

కామవరపుకోట : తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం జెడ్పీటీసీ కడిమి రమేష్ చేతులమీదుగా హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి సామాన్యులందరికీ ఇంగ్లీష్ మీడియం చదువు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చికాకుళ్ల నాగరాజు, ప్రధానోపాధ్యాయులు జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లను అందజేస్తున్న జెడ్పీటీసీ కడిమి రమేష్

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

లింగపాలెం : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదం, హౌసింగ్ ఏఈ ఏలూరి వెంకటేశ్వరావు అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా భోగోలు గ్రామంలో జగనన్న లేఅవుట్‌ను శనివారం అధికారుల బృందం పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో యుద్ధప్రాతిపదికన మంచినీటి సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు. రాయితీపై సిమెంట్, ఇనుము సరఫరా చేయడంతో పాటు ఎలాంటి జాప్యం లేకుండా బిల్లులు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని లబ్ధిదారులు త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. సర్పంచ్ తాడేపల్లి శాంతారావు, పీఆర్ ఏఈ జగన్నాధరావు, ఏపీఎం కమలాదేవి, కార్యదర్శి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి

జంగారెడ్డిగూడెం రూరల్ : గ్రామాల్లో సమస్యలుంటే తనకుగానీ, ప్రజాప్రతినిధుల దృష్టికిగానీ తీసుకువస్తే పరిష్కరిస్తామని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ కొదమ జ్యోతి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. వేసవి కాలం సమీపించడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు సక్రమంగా అందించేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె. కిరణ్‌కుమార్, తహసీల్దార్ స్లీవ జోజి, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కొదమ జ్యోతి

ఏజెన్సీలో ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని విరమించుకోవాలి

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని విరమించుకోవాలని ఏపీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పోలోజు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో శనివారం కారం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీప్రాంతంలో ఆయుధ కర్మాగార నిర్మాణానికి భూములను సేకరించే ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలన్నారు. జీలుగుమిల్లి మండలంలోని రామన్నగూడెం, వంకవారిగూడెం, తాటాకులగూడెం గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల భూమిని ఆయుధ తయారీ, డంపింగ్‌యార్డ్ కోసం సేకరించేందుకు సర్వేలు చేస్తున్నారని, ఈ ప్రక్రియను వెంటనే ఆపాలని కోరారు. నాయకులు చంద్రు బుల్లెమ్మ, చోడెం దుర్గ, కొవ్వాసి దుర్గారావు, కట్టా వెంకటేశ్వరరావు, పూనెం మల్లేశ్వరరావు, శ్రీను, మునీశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తగాదాలతో జీవితాలను పాడుచేసుకోవద్దు

చింతలపూడి : కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, చిన్న, చిన్న తగాదాలతో సంసారాలను నాశనం చేసుకోవద్దని జూనియర్ సివిల్ జడ్జి పి పరేష్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లు, కోర్టులు సంసారం చేయించలేవని, ఒకరిని ఒకరు అర్థం చేసుకుని సర్దుకుపోవాలని సూచించారు. అహంకారాలకు పోయి పిల్లల సంసారాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల మాణిక్యాలరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమయ్య, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, న్యాయవాదులు పాల్గొన్నారు.


ప్రత్యేక లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పి పరేష్‌కుమార్

విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం : పట్టణంలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డు, సుబ్బారెడ్డి కాలని, జెడ్పీ హైస్కూల్, కాజా పంతులు హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ఉప్పలమెట్ట, శ్రీనివాసపురం రోడ్డు, తాండ్రపాపారాయుడు సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

లింగపాలెం : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి కె.రామారావు అన్నారు. యర్రావారిగూడెం పాఠశాలలో శనివారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, నాడు-నేడుకు సంబంధించిన రికార్డులు, మధ్యాహ్న భోజనం మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు బాగున్నాయన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో సులభమైన రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్‌లను ఎంఈవో తిలకించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు జి.సుజాత, సీఆర్‌పీలు టి.వెంకటరత్నం, టి.కనకరాజు, జి కుమార్‌మంగళం, టి.సునీత పాల్గొన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో రామారావు

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని శనివారం స్వామివారికి కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో మొదలకుని ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదాగోష్టి తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు శ్రీనివాసునికి, లక్ష్మీ, గోదా అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఉభయదారులుగా అద్దవారం గ్రామానికి చెందిన 15మంది జంటలు పాల్గొన్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. భక్తులకు జంగారెడ్డిగూడెంకు చెందిన మద్రివాడ రామయ్య, సత్యవతి, వేంకట సూర్యముత్తరావు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కె.బాలక్రిష్ణరెడ్డి, కె.శ్రీహరిరావు, రెడ్డి రంగప్రసాద్, దండుదనరాజు, వాసవిసాయి నగేష్, పాల్గొన్నారు.


పారిజాతగిరిలో శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థుల ఘటనపై విచారణ

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన ఘటనపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ శనివారం విచారణ నిర్వహించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను, అధికారులను విచారించారు. విచారణకు ఒక విద్యార్థి హాజరుకాగా మిగిలిన వారు రాలేదు. తనను ఎవరూ కొట్టలేదని, కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు విద్యార్థి లిఖితపూర్వకంగా కమిషన్ సభ్యుడికి తెలియజేశాడు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దినపత్రికల్లో వచ్చిన వార్తను ఆధారంగా చేసుకుని కమిషన్ సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టినట్లు చెప్పారు. ఎంఈవో, సీడీపీవో, వార్డ్ సెక్రటరియేట్ స్టాఫ్, హెచ్‌ఎంతో కలిసి పాఠశాలను సందర్శించిన ఆయన ఫ్యాన్‌లు, బాత్రూమ్‌లు, మౌలిక వసతులను పరిశీలించారు.

ఏం జరిగిందంటే

విద్యార్థులు ఫ్యాన్‌లు, పాఠశాలలోని మౌలిక వసతులు పాడుచేస్తున్నారనే కారణంగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చే నిమిత్తం ఉపాధ్యాయులు శుక్రవారం వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించివేశారు. అయితే పిల్లలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టారంటూ తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బాలల హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది.

విద్యార్థులకు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో బి.రాముడు, హెచ్‌ఎం జి.జగ్గారావు, సీడీపీవో బ్యూలా, సూపర్ వైజర్ విజయలక్ష్మి, కానిస్టేబుల్ మౌనిక పాల్గొన్నారు.


జెడ్పీ హైస్కూల్‌లో విచారణ నిర్వహిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్

శ్రీచక్రార్చనతో సకల శుభాలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం 108 శ్రీచక్రాలకు సామూహిక శ్రీచక్ర నవావరణార్చన నిర్వహించారు. ఉదయం నిత్యపూజలు, కైంకర్యాల అనంతరం ఆలయ కళ్యాణకళావేదికపై అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి ఆలయకమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధానార్చకులు యరమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక పూజలు జరిపారు. శ్రీచక్ర అర్చన ద్వారా ఇష్టప్రాప్తి, అనిష్టపరిహారం జరిగి సకల శ్రేయస్సు, శుభాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. సాయంత్రం నాలుగు మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. పోలుపర్తి సన్యాసి, ఎర్రమ్మ దంపతులు,.పంచాడ పట్టియ్య, కొండమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి మనవడు పోలుపర్తి దుర్గారావు, వీరలక్ష్మి దంపతులు నూకాలమ్మకు రూ.1.08లక్షల విలువ కలిగిన వెండి కిరీటాన్ని సమర్పించారు. దాతలకు అమ్మవారి చిత్ర పటాన్ని, శేష వస్త్రాన్ని ఇచ్చి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో నవావరణార్చన నిర్వహిస్తున్న దృశ్యం

అరుణాచలానికి ప్రత్యేక బస్ సర్వీసు

జంగారెడ్డిగూడెం : అరుణాచలం గిరిప్రదక్షిణలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతినెలా పౌర్ణమి ముందు రోజు అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సులను నడుపుటకు నిర్ణయించినట్లు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రా స్పెషల్ బస్సులు శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల దర్శనానంతరం అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణలు, దర్శనానంతరం బయలుదేరి తిరిగి జంగారెడ్డిగూడెం వస్తుందన్నారు. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా కోరారు. టికెట్ ధర ఒకరికి రూ.2,800 నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రతి శనివారం ఉదయం 5.00 గంటలకు వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనార్థం బస్సు నడుపుతున్నామని, టికెట్ ధర ఒకరికి రూ. 115 నిర్ణయించినట్లు వివరించారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విశ్రాంత ఉద్యోగులు ఆ సంఘం కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు బొబ్బర సూర్యచంద్రరావు మాట్లాడుతూ పెన్షనర్ల పెండింగ్ డీఏలు వెంటనే మంజూరు చేయాలని, 1వ తేదీనే పెన్షన్ విధిగా చెల్లించాలని, పీఆర్‌సీ, డీఆర్ బకాలు వెంటనే చెల్లించాలని, డెత్ క్లెయిమ్స్, ఫ్యామిలీ పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కొమ్ముకూరి నాగేశ్వరరావు, ఎస్.రాధాకృష్ణ, బాలకృష్ణ, ఎస్‌కే దాదా, రొంగల సత్యనారాయణ, అయ్యన్న, వి.అచ్యుతం, కె.వీరాస్వామి, ఎల్.రఘురాం పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ద్వారకాతిరుమల : నాటు సారా విక్రయిస్తున్న ఒక మహిళను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం కామవరపుకోట మండలం గద్దేవారిగూడెంకు చెందిన టి.లక్ష్మి స్థానిక వసంత్‌నగర్ కాలనీ శివారులో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం కొనకళ్ల రత్నాంజలికి, శ్రీనివాసరావుకు 1999లో వివాహమైంది. ఆ సమయంలో రూ.75 వేలు, 8 కాసుల బంగారం కట్నంగా ఇచ్చారు. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. ఇటీవల అదనపు కట్నం కోసం శ్రీనివాసరావు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని బాధితురాలు రత్నాంజలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మనోవర్తి కేసు పరిష్కారం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని కోర్టుప్రాంగణంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి మాట్లాడుతూ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా ఒక మనోవర్తి కేసు పరిష్కారమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్‌ఆర్ టీ తేజస్విని పాల్గొన్నారు.